

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

## సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, నవంబర్ 8 : పోలీస్ అధికారులు సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులను నమోదు చేయాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సైబర్ వారియర్స్‌తో ఆయన తన కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకుంటున్న చర్యలతో పాటు పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలను నియంత్రించడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయిన బాధితులు తక్షణమే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సంతోష్, సైబర్, ఐటీ కోర్ విభాగాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

## కారం పొడి గ్యాంగ్ అరెస్టు

### రూ.19 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

సుబేదారి, నవంబర్ 8 : అర్ధరాత్రి ఇళ్లలో చోరీలకు పాల్పడి, పట్టుబడకుండా కారంపొడి చల్లి పోలీసులకు సవాల్ విసురుతున్న కారంపొడి ముఠాను సీసీఎస్, హనుమకొండ పోలీసులు సంయుక్తంగా బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.19 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు 4 సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుకు కథనం ప్రకారం.. హనుమకొండలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎండీ అఫ్జల్‌పాషా, ఎండీ ఫహీం, ఎండీ షాహెద్, ఎండీ గౌస్‌పాషా, ఎస్కే అస్లాం చికెన్‌సెంటర్, వాటర్ సర్వీసింగ్ సెంటర్, పాత ఇనుప సామాను షాపుల్లో పనిచేస్తూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు ఆడుతూ జల్సాలకు అలవాటు పడ్డారు. డబ్బుల కోసం ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తూ చోరీ సొత్తును రఫీక్, రేహేనాబేగం దగ్గర దాచిపెట్టేవారు. ఇలా నిందుతుల్లో ఒకరైన అఫ్జల్‌పాషా బైక్‌పై రాత్రిపూట కాలనీల్లో తిరుగుతూ లష్కర్‌బజార్, న్యూరాయపుర, కాకతీయకాలనీలో ఆభరణాలను చోరీచేసి, గుండ్లసింగారంలో రెండు ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అలాగే, సోమిడి, ఫాతిమానగర్‌లో రెండు చోట్ల దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్, హనుమకొండ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో మంగళవారం రాత్రి హనుమకొండ చౌరస్తాలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన క్రైం డీసీపీ మురళీధర్, సీసీఎస్ ఏసీపీ మల్లయ్య, ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, ఐటీ కోర్ ఏఏవో ఎండీ సల్మాన్, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, ఎస్సైలు యాదగిరి, బాపురావు, రాజేందర్, సిబ్బందిని సీపీ అభినందించారు.




సర్క్యూట్ హౌస్ రోడ్డులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## ఓటు ఎంతో విలువైంది

హనుమకొండ, నవంబర్ 8 : ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేసి, తమ బాధ్యతను నెరవేర్చాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. జిల్లా యంత్రాంగం స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సర్క్యూట్ హౌస్ రోడ్డులోని కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి శ్రీనివాస్ పాల్గొని ఓటు విలువ గురించి వివరించారు. ప్లకార్డులు, బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలి

- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్
- బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

హనుమకొండ సిటీ : బీఆర్ఎస్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ కోరారు. బుధవారం 4వ డివిజన్‌లోని పెద్దమగడ్డలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్దమ్మగడ్డ జంక్షన్‌లోని అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలవేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు నిరుపేదలు ముందు వరుసలో నిలబడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, డివిజన్ ఇన్‌చార్జి రవీందర్, డివిజన్ అధ్యక్షుడు మనోజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

**8వ డివిజన్‌లో..**

హనుమకొండ చౌరస్తా : వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్వీ 8వ డివిజన్ అధ్యక్షుడు నలుబోలు కార్తీక్ కోరారు. డివిజన్‌లో బుద్ధభవన్, రెడ్డికాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.



హనుమకొండ సిటీ: పెద్దమ్మగడ్డలో ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌భాస్కర్

**31వ డివిజన్‌లో..**

న్యూశాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా దాస్యం వినయ్‌భాస్కర్‌ను మరోసారి గెలిపించుకుందామని గ్రేటర్ 31వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పలు కాలనీల్లో వారు ఇంటింటా ప్రచారం చేశారు. పదేండ్ల కాలంలో చీఫ్ విప్ చేసిన అభివృద్ధి పనులను చూడాలని, మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



హనుమకొండ చౌరస్తా : రెడ్డికాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు



న్యూశాయంపేట : 31వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్‌కు అండగా నిలుద్దాం

- పశ్చిమ అభ్యర్థి దాస్యంను భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం

కాజీపేట, నవంబర్ 8 : సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నందున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కుల బాంధవులంతా అండగా నిలువాలని పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం పిలుపునిచ్చారు. కాజీపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తేలు సారంగపాణి అధ్యక్షతన మండల పద్మశాలి కుల బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈగ మల్లేశం పాల్గొని మాట్లాడుతూ సమైక్య పాలనలో కులవృత్తిదారులను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కులవృత్తిదారులకు సరైన న్యాయం జరుగుతోందన్నారు. భవిష్యత్‌లో కుల బాంధవులు రాజకీయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నగరంలోని పద్మశాలి కుల బాంధువులందరూ తమ ఓటును చీఫ్ విప్, బీఆర్ఎస్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్‌కు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాజీపేట పరిధిలో భవిష్యత్‌లో పద్మశాలి కులస్తులకు కమ్యూనిటీ హాల్‌ను సొంత ఖర్చులతో ఏర్పాటు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవులపల్లి సదానందం, తోట యాదగిరి, పాము రాజేశ్, ఆనంద్, జగదీశ్, నల్ల అగ్రరాజు, పున్నమి చందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

## నిరుపేద కుటుంబానికి చేయూత

వరంగల్, నవంబర్ 8 : ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చేయూతనందించారు. బుధవారం శాంతినగర్‌కు చెందిన మచ్చా సుమిత్ర కుమార్తె వివాహానికి పుస్తె, మట్టెలను అందజేశారు. అలాగే, బియ్యం, కొంత నగదు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తోనుపునూరి వీరన్న, గట్టు మహేశ్‌బాబు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు మధు, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేశ్, కోశాధికారి ఎలగందుల రాజేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఒల్లాల శైలజ, నాయకులు శ్రీదర్, మురళి, రమేశ్, ప్రవీణ్, స్రవంతి పాల్గొన్నారు.

## రైల్వే దేవాలయంలో అన్నదానం

కాజీపేట, నవంబర్ 8 : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని శ్రీహరిహర పుత్ర శ్రీధర్మ శాస్త్ర ఆలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు ఉడుతల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి నెల రెండో బుధవారం భక్తుల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురు స్వాములు సురేందర్‌రావు, మీనాక్షి, ఆవాల పురుషోత్తంరెడ్డి, కోటగిరి సంపత్, అరూరి సాంబయ్య, రాజేందర్, కృష్ణ, సాంబయ్య పాల్గొన్నారు.

## నేడు, రేపు జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలు

హనుమకొండ సిటీ, నవంబర్ 8 : ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో లష్కర్‌బజార్‌లోని ప్రాక్టిసింగ్ ప్రైమరీ పాఠశాలలో 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పది అంశాల్లో జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికల నుంచి వేర్వేరుగా ప్రతి విభాగం నుంచి ఒక్కరి చొప్పున మొత్తం 20 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు మధుసూదన్‌రెడ్డిని 9849834110 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**నేడు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు**

జిల్లా స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనువాస్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి జూనియర్ 5, సీనియర్ 5 మొత్తం 10 ప్రాజెక్టులను తీసుకురావొచ్చని తెలిపారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

## కాజీపేట రైల్వే జంక్షన్‌లో తనిఖీలు

కాజీపేట, నవంబర్ 8 : కాజీపేట రైల్వే జంక్షన్‌లో బుధవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ పాల్గొని స్టేషన్‌లోని ప్రయాణికుల బ్యాగులను క్షుణంగా తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని, వారి సమాచారాన్ని సేకరించి వదలిపెట్టారు. ఈ సందర్భగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో కాజీపేట సీఐ సార్ల రాజు, ఎస్సై లలిత పాల్గొన్నారు.